www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 15 సెప్టెంబర్ 2024




## యుసిఐఎల్ వద్ద బ్యాంకు ఏర్పాటు చేయాలి

**ప్రజాశక్తి -పులివెందుల టౌన్ :** నియోజకవర్గంలోని వేముల మండలం తుమ్మలపల్లె వద్ద ఉన్న యురేనియం ప్రాజెక్టు ఉద్యోగస్తులు, కార్మికుల ఉపయోగార్థం ఇక్కడ భారతీయ స్టేట్ బ్యాంకు ఏర్పాటు చేయాలని ప్రజా అవసరాల సంఘం నాయకులు సూర్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఉదయం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత విలువైన ఖనిజంగా ఎక్కువ నిల్వలో ఉన్న పులివెందుల యురేనియం కర్మాగారం వద్ద బ్యాంకును ఏర్పాటు చేయాలన్నారు. ఇందులో సుమారు 4000 మంది ఉద్యోగస్తులు పనిచేస్తున్నారని అలాగే రాచకుంటపల్లె ,భూమయ్యగారి పల్లె, మబ్బు చింతలపల్లె, తుమ్మలపల్లె, కె.కె.కొట్టాల వంటి గ్రామాల ప్రజలు కూడా బ్యాంక్ అవసరాల కోసం పులివెందుల వెళ్లాల్సి వస్తుందని చెప్పారు. యురేనియం ప్రాజెక్టు వద్ద బ్యాంక్ ఉన్నట్లయితే ఉద్యోగస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి బ్యాంకును ఏర్పాటు చేయాలని కోరారు.

# వెంటాడుతున్న యూరియా కొరత

### కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు
### రైతు సేవా కేంద్రాల్లో దొరక్క అవస్థలు
### ప్రయివేట్ దుకాణాలను ఆశ్రయిస్తున్న రైతులు

**యూరియా అందక రైతుల్లో ఆందోళన నెలకొంది. రైతు సేవా కేంద్రాల్లో, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. కొందరు డీలర్లు కృత్రిమ కొరత సృష్టించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే అదునుగా కొంత మంది వ్యాపారులు ధరలు ఇష్టానుసారంగా పెంచేసి అమ్ముకుంటుండటంతో రైతులకు ఆవేదన తప్పడం లేదు.**



**ప్రజాశక్తి - చాపాడు**

ప్రభుత్వాలు మారినా, రైతు సేవా కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటైనా రైతులకు సమస్యలు మాత్రం తప్పడం లేదు. ప్రస్తుత ఖరీఫ్‌లో వరి పంట సాగు చేసే రైతులకు ఎరువుల కొరత ముఖ్యంగా యూరియా కోసం నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో ఎరువుల కోసం గంటల తరబడి క్యూలైన్లో నిలిచే రైతులకు రైతు సేవా కేంద్రాలను గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసి అవసరమైన ఎరువులు గ్రామాలకు చేరవేస్తామని అని ప్రకటించిన ప్రభుత్వం అమలులో మాత్రం పూర్తిగా వైఫల్యం చెందినట్లు తెలుస్తోంది. రైతు సేవా కేంద్రాలకు రైతులు ఆధార్, పట్టాదారు పాసు పుస్తకంతో ఎరువులను అందుబాటులో ఉన్న సందర్భంలో మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి వస్తుంది. రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు కావాలంటే ప్రయివేట్ దుకాణాలను ఆశ్రయించాల్సి వస్తుంది. యూరియా కోసం రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తుంది. యూరియా నిలువ వచ్చిన రోజు సాయంత్రంలోపు పూర్తిగా అయిపోతుంది. తిరిగి నిలువ రావడానికి 15 రోజుల సమయం వేచి ఉండాల్సి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. ఒక్కొక్క రైతు భరోసా కేంద్రం పరిధిలో ఒకరు లేదా ఇద్దరు రైతులకు మాత్రమే యూరియా లభిస్తున్నట్లు తెలుస్తుంది. ఎరువుల దుకాణాల్లో కూడా యూరియా కొరత కొట్టొచ్చినట్లు కనిపిసుంది. ముఖ్యంగా మైదుకూరు పట్టణంలో వ్యాపారులు కృత్రిమ కొరత చూపిస్తున్నట్లు తెలుస్తుంది. రైతులకు అవసరం లేకపోయిన దుకాణాల వారు సూచించిన ఎరువులు తీసుకుంటేనే యూరియా ఇవ్వడం, యూరియాను అధిక ధరకు అమ్మకాలు చేపట్టడం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో కెసి కెనాల్, కుందూ పరిధిలో జిల్లాలో 90 వేల ఎకరాలలో వరి పైరు ను రైతులు సాగుచేస్తున్నారు. ఎకరాకు 2 బస్తాలు యూరియాను వినియోగించినప్పటికీ రెండు లక్షల బస్తాల యూరియా అవసరం ఉంటుంది. చాపాడు మండల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటికే 10 వేల ఎకరాలకు పైగా వరి పంట సాగు అయింది. వారం, పది రోజుల్లో మూడు నుంచి నాలుగు వేల ఎకరాల్లో వరి పంట సాగు అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలో రోజుకు పది బస్తాల యూరియా కూడా లభించడం లేదు. చాపాడు మండల రైతులు అధికంగా మైదుకూరు ప్రొద్దుటూరు ప్రాంతాలకు వెళ్లి ఎరువులు కొనుగోలు చేసే ఆనవాయితీ ఉంది. మైదుకూరులో ఏ దుకాణంలో కూడా 10 రోజుల నుంచి యూరియా అందుబాటులో లేనట్లు కొరత లేనట్లుగా చూపిస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం యూరియా కొరత రైతులను వెంటాడుతోంది. అధికారులు మాత్రం యూరియా కొరత లేనట్లు ప్రకటనలు చేస్తున్నారు. ప్రభుత్వాలు మారినా రైతులకు తిప్పలు తప్పడం లేదని తేట తెల్లమవుతుంది. యూరియా కొరతపై వ్యవసాయ అధికారులు జిల్లావ్యాప్తంగా కొరత ఉందని చెబుతున్నారు..రైతులు మాత్రం చేసేది ఏమీ లేక ఇతర ఎరువులతో సరిపెట్టుకోవాల్సి వస్తుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వరి పంట సాగుచేసే రైతులకు యూరియా కొరత లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### అందుబాటులో ఉంచాలి

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 4 ఎకరాలలో వరి పంటను సాగు చేపట్టాను. రైతు సేవా కేంద్రాల్లో యూరియా కోసం వెళ్ళినప్పుడు అందుబాటులో ఉండడం లేదు. మైదుకూరులో ప్రయివేట్ దుకాణాల్లో అన్ని రకాల ఎరువులు కొనుగోలు చేస్తేనే యూరియాను ఇస్తున్నారు. ఉన్నత అధికారులు స్పందించి యూరియాను రైతులకు అందుబాటులో ఉంచాలి. ప్రయివేట్ దుకాణాల్లో రైతుల కోరిన వెంటనే యూరియాను అందించేలా ఆదేశాలు జారీ చేయాలి

**-వీరారెడ్డి, రైతు, సిద్ధారెడ్డిపల్లి.**

### సమృద్ధిగా లభించడం లేదు

ప్రయివేట్ దుకాణాల్లో యూరియా నిలువ లేదంటున్నారు. అన్ని రకాల ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు మాత్రం యూరియాను అందిస్తున్నారు. కేవలం యూరియా కోసమే దుకాణాలకు వెళితే లేదని వెనుకకు పంపుతున్నారు. రైతు సేవా కేంద్రాల్లో కన్నా రూ. 10 అధికంగా వసూలు చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి యూరియా కొరత లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**- ఓబుల్ రెడ్డి, రైతు, పాతపాలెం, మైదుకూరు.**

### ఎరువులు అందుబాటులో ఉంచాం

మండల పరిధిలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాం. యూరియా అవసరం మేరకు పంపిణీ చేస్తున్నాం. రైతులు యూరియాను అవసరం మేర కంటే అధికంగా వినియోగిస్తున్నారు. యూరియాను అవసరం మేరకు మాత్రమే ఉపయోగిస్తే ఉపయోగకరంగా ఉంటుంది. ఎరువుల కొరత రాకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం.

**- మ్యాగీ, వ్యవసాయ అధికారి, చాపాడు.**

# 'స్వచ్ఛతా హీ సేవ'ను విజయవంతం చేయాలి

### - కలెక్టర్ శివశంకర్ లోతేటి


నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న కలెక్టర్, జెసి, ఎమ్మెల్యే, ప్రజలు

**ప్రజాశక్తి - కడప అర్బన్**

స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని అందరి భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని కలెక్టర్ శివ శంకర్ లోతేటి అన్నారు. శనివారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా రాజీవ్ మార్గ్ వద్ద నుంచి కోటిరెడ్డి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని కలెక్టర్, కడప శాసనసభ్యులు మాధవి సంయుక్తంగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం ఈనెల 17 నుంచి అక్టోబర్ 1 వ తేదీ వరకు నిర్వహించనున్న సందర్భంగా ర్యాలీ నిర్వహించామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీ, గ్రామపంచాయతీలలో 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. షెడ్యూల్ ప్రకారం 15 రోజులపాటు జరగనున్న స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు ఎలాంటి అలసత్వం లేకుండా నిర్వహించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై మానవహారాలు, స్వచ్ఛతా పరుగు, ర్యాలీ, మారథాన్ రన్, వర్క్ షాపులు, మొదలగు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, బహిరంగ స్థలాలలో స్వచ్ఛత ప్రతిజ్ఞ పాటించి శ్రమదానం నిర్వహించి పరిశుభ్రం చేయాలని సూచించారు. ప్రజా ప్రతినిధులను, ప్రముఖులను భాగస్వాములను చేస్తూ స్వచ్ఛతా హీ సేవ పై అవగాహన కార్యక్రమాలు చేపటాలన్నారు. ప్రజలు, విద్యార్థుల భాగస్వామ్యం ఉండాలన్నారు. సఫాయి మిత్రా సురక్ష కింద సఫాయి కర్మచారులకు సేఫ్టీ పరికరాలు అందించడం, ఆరోగ్య సదస్సులు నిర్వహించడం వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గ్రీన్ అంబాసిడర్స్‌కు పూర్తి అవగాహన కల్పించాలని చెప్పారు. మెడికల్ క్యాంపు కూడా నిర్వహిస్తారని పేర్కొన్నారు. హెల్త్ ఇన్సూరెన్స్‌పై అవగాహన కల్పిస్తారని చెప్పారు. కడప శాసనసభ్యులు మన పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవడంతోపాటు అందరికీ అవగాహన కల్పించాలని చెప్పారు. మన ఇంటి పరిసరాలు, వీధులు, మన నగరం పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు వచ్చి పనిచేయాలన్నారు. ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించేందుకు ముందుకు రావాలన్నారు. అనంతరం కోటిరెడ్డి సర్కిల్ వద్ద స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమ సందర్భంగా మానవహారం చేశారు. స్వచ్ భారత్ సేవ ప్రతిజ్ఞ చేశారు. **బుగ్గవంకను పరిశీలించిన కలెక్టర్**..పట్టణం గుండా వెళ్తున్న బుగ్గ వంకను సుందరీకరిస్తామని కలెక్టర్ శివ శంకర్ లోతేటి అన్నారు. శుక్రవారం ర్యాలీ ముగిసిన అనంతరం స్థానిక నాగరాజు పేట నారాయణ కళాశాలకు సమీపంలో ఉన్న బుగ్గ వంక బ్రిడ్జి నుంచి వంకను పరిశీలించారు. ఆ ప్రాంతం అంతా ఆయన కలియతిరిగారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవంబర్‌లో ఆపరేషన్ బుగ్గ వంక పేరుతో ఆధునీకరిస్తామని చెప్పారు. అందులో ఉన్న చెత్త, పిచ్చి మొక్కలను తొలగించి నీళ్లు సాఫీగా వెళ్లేటట్లు చూస్తామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అతిధి సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్ రాకేష్ చంద్ర, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, డిపిఒ ప్రభాకర్ రెడ్డి, జడ్‌పి సిఇఒ సుధాకర్ రెడ్డి, సమాచార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, అధికారులు, నేతలు గోవర్ధన్ రెడ్డి , సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్‌లో 3200 కేసులు పరిష్కారం

### రూ. 6.24 కోట్లు మొత్తం కక్షిదారులకు చెల్లింపు



పరిహారం చెక్కును అందజేస్తున్న జడ్జీలు

**ప్రజాశక్తి - కడప**

జాతీయ లోక్‌అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా 3200 కేసులు పరిష్కరించి రూ. 6.24 కోట్ల మొత్తం కక్షిదారులకు చెల్లించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా వ్యాప్తంగా 23 బెంచీలు ఏర్పాటు చేసి జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకొని రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకున్నారన్నారు. అందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి ఎల్. వెంకటేశ్వరరావు, 4వ అదనపు జిల్లా జడ్జి జి. దీన బాబు, సీనియర్ సివిల్ జడ్జ్ ఎస్.ప్రవీణ్ కుమార్, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జ్ కే.ప్రత్యూష కుమారి, ఎక్సైజ్ కోర్టు జడ్జ్ జె.హేమ స్రవంతి, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.భార్గవి, మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ జి. విజయలక్ష్మి, కడప బార్ అసోసియేషన్ బొగ్గుల గుర్రప్ప నాయుడు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కక్షిదారులు, బ్యాంక్ అధికారులు, ఇన్సూరెన్స్ అధికారులు పాల్గొన్నారు.

**రోడ్డు ప్రమాద కేసులో బాధితురాలికి పరిహారం చెల్లింపు**

రోడ్డు ప్రమాద కేసు పరిష్కరించి బాధితురాలు కోవూరు కృష్ణవేణికి రూ.1,20 కోటి నష్టపరిహారం చెల్లించారు. ఈ సందర్భంగా కోవూరు కృష్ణవేణి మాట్లాడుతూ తన భర్త రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించానని చెప్పారు. తన కేసును బజాజ్ అలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ వారు జాతీయలోక్ అదాలత్‌లో వాది తరపున న్యాయవాది ఏ. ఆదినారాయణ రెడ్డి, ప్రతి వాది తరపున న్యాయవాదులు జి. సాయి వంశీకృష్ణ, డి.రాజశేఖర్ రెడ్డి, వి ఆదినారాయణ రెడ్డి సంప్రదింపులు జరిపారన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో తనకు రూ. 1.20 కోటి పరిహారం అందించారన్నారు. న్యాయం చేసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవికి, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎల్. వెంకటేశ్వరరావుకు, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా కృషి చేసి పరిష్కరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జ్ బాబా ఫక్రుద్దీన్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# భూ ఆక్రమణలపై విచారణ వేగవంతం చేయండి

### వారం రోజుల్లోపు నివేదిక ఇవ్వాలని ఆదేశం
### వ్య.కా.సం, ఆక్రమణదారుల సమావేశంలో డిఆర్ఒ

**ప్రజాశక్తి - కడప సిటీ**

బద్వేల్ నియోజకవర్గ పరిధిలోని సి.కొత్తపల్లి, కాశినాయన, కలసపాడు మండలాల్లోని భూముల ఆక్రమణలపై విచారణ చేపట్టాలని డిఆర్ఒ గంగాధర్‌గౌడ్ ఆదేశించారు. శుక్రవారం డిఆర్ఒ బద్వేల్ తహశీల్దార్, సర్వేయర్లు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, భూ ఆక్రమణలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్న వారిని పిలిపించి ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వి.అన్వేష్ లోతుగా సాగించిన పరిశీలన పత్రాలను స్వీకరించారు. వాటిని పరిశీలించిన అనంతరం ప్రొద్దుటూరుకు చెందిన భూ ఆక్రమణ ఆరోపణలు కలిగిన పెత్తందారుని వాదన ఆలకించారు. దీనిపై ఆక్రమణ ఆరోపణలు ఉన్న పెత్తందారు డిఆర్ఒ సమక్షంలోనే వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అన్వేష్‌తో మాటాడుతూ తాను ఎవరి భూములూ ఆక్రమించలేదని, ఇవిగో పాసుపుస్తకాలు చూసుకోవాలని, తనపై పత్రికల్లో వార్తలు రాకుండా వస్తే బాగుండదని హెచ్చరిక స్వరంతో మాట్లాడడం గమనార్హం. దీనికి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అన్వేష్ స్పందిస్తూ, మీ కుమారుని పేరుతో ఉన్న భూములు ఇవిగోనని చూపించడంతో నిమ్మకుండిపోయారు. బద్వేల్ నియోజకవర్గ పరిధిలోని భూ ఆక్రమణలపై జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం భూ ఆక్రమణలపై పెద్దఎత్తున ఉద్యమిస్తున్న సంగతి తెలిసిందే. దీనిపై డిఆర్ఒ మాటాడుతూ వారం రోజుల్లో బద్వేల్ తహశీల్దార్ పరిధిలోని భూ ఆక్రమణలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, ఆరోపణలు కలిగిన వ్యక్తులు, తహశీల్దార్, సర్వేయర్లు పాల్గొన్నారు.

# ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులను ఇవ్వొద్దు

### ఎస్‌పి వి.హర్షవర్ధన్ రాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి

**ప్రజాశక్తి - కడప అర్బన్**

జిల్లాలో గంజాయి విక్రయాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో దాడులు ముమ్మరంగా చేయడంతో గంజాయికి వ్యసనానికి అలవాటు పడ్డ యువత ఇతర ప్రత్యామ్నాయ మార్గాలలో భాగంగా మత్తు కలిగే మందుల కోసం మెడికల్ షాప్‌లకు వచ్చే అవకాశం ఉందని, ఎట్టి పరిస్థితుల్లో ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులను విక్రయించవద్దని ఎస్‌పి వి.హర్షవర్ధన్‌రాజు మెడికల్ షాప్ నిర్వాహకులకు సూచించారు. శనివారం స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ వారికి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మార్పు వచ్చిందని, మనం సమష్టిగా చర్యలు తీసుకుని డ్రగ్ రహిత సమాజంగా చేయాల్సిన తరుణం ఆసన్నమైందని పేర్కొన్నారు. మత్తు పదార్థాలు వల్ల కలిగే అనర్థాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో యువతకు కళాశాలల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని తెలి పారు. సమస్యను గుర్తించి పరిష్కరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మెడికల్ షాప్‌లకు వచ్చి మత్తు కలిగించే మందుల కోసం ఎవరైనా వస్తే అలాంటి వారి సమాచారాన్ని పోలీసు శాఖకు తెలియచేయాలని సూచించారు. జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జి.మాధవి మాట్లాడుతూ నార్కోటిక్స్‌ను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించిందని తెలిపారు. వైద్యులు వ్యాధి నయం చేసేందుకు ఉద్దేశించి రాసిన ప్రిస్క్రిప్షన్ ఉన్న వారికి మాత్రమే మందులు విక్రయించాలని మెడికల్ షాప్ యజమానులకు సూచించారు. ప్రస్తుత సమాజంలో కొన్ని రకాల మందులను యువత దుర్వినియోగం చేసే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆర్ఎక్స్, ఎన్ఆర్ఎక్స్‌ల పేరిట వర్గీకరించి వైద్యులు సిఫారసు చేసే మందులను విక్రయించినపుడు ఎన్ని విక్రయించింది, తేదీ, స్టాంప్‌తో సహా రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. ప్రిస్క్రిప్షన్ తీసుకు వచ్చినా టీనేజ్ వారికి ఎట్టి పరిస్థితిలో ఇవ్వకూడదన్నారు. యువత బాగు న్నపుడే దేశ భవిత బాగుంటుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్. వెంకట రాముడు మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల శారీరకంగా, మానసికంగా కలిగే అనర్థాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. మత్తు పదార్థాలకు అలవాటు పెద్దవారికి అవి క్రమంగా ప్రాణాంతకంగా పరిణమి స్తాయన్నారు. జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.నరసింహమూర్తి మాట్లాడుతూ ఎస్‌పి తమను భాగస్వాములను చేస్తూ ఇలాంటి అవగాహన కార్యక్రమం నిర్వహించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. యువత మెడికల్ షాప్‌లకు వచ్చి మందులను దుర్వినియోగం చేసే అవకాశం ఉందని, అసోసియేషన్ వారిని అప్రమత్తం చేయడం సంతోషంగా ఉందన్నారు. నిబంధనల మేరకు నడుచుకునేలా రిటైల్ షాప్ నిర్వాహకులకు తెలియజేస్తామని, పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమం అనంతరం చికిత్సకు ఉద్దేశించిన మందుల దుర్వినియోగం కాకుండా వతమ వంతు కృషి చేస్తామని కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ వారు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏ.ఆర్ అదనపు ఎస్‌పి ఎస్.ఎస్.వి కృష్ణారావు, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్‌పి రమాకాంత్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు యు.వెంకటకుమార్, హేమకుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్ట్స్ కళాశాల అభివృద్ధికి కృషి

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** విద్యా బుద్ధులు, వినయ సంపన్నత నేర్పి, జీవితమంటే ఏమిటో అవగాహన కల్పించి, సమాజంలో గౌరవంగా బతికేలా తయారు చేసిన తమ ఆర్ట్స్ కళాశాల అభివృద్ధికి నిరంతరం పాటుపడతామని పూర్వ విద్యార్థులు ముక్తకంఠంతో ఉద్ఘాటించారు. కడప గవర్నమెంట్ ఆర్ట్స్ కళాశాల 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన ప్లాటినం జూబ్లి ఉత్సవాలలో రెండో రోజు ఉదయం పూర్వ విద్యార్థుల సమావేశం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ అధ్యక్షతన నిర్వహించారు. ఎస్‌వియు మాజీ రిజిస్ట్రేషన్ ఆర్ట్స్ కళాశాల ప్లాటినం జూబ్లీ ఉత్సవాల సమన్వయకర్త ఆచార్య రాజశేఖర్‌రెడ్డి సమన్వయం చేశారు. పూర్వ విద్యార్థి కేరళ టూరిజం డిపార్టుమెంటు ప్రిన్సిపల్ సెక్రటరి కె. శ్రీనివాస్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులంతా ఒకటిగా తయారై ఇప్పటి కే పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. భవిష్యత్తులో మరింత ప్రగతి ఉంటుందని తెలిపారు. కళాశాలను సుదీర్ఘకాలం తరవాత చూశానని, ఆ నాటి రోజులు గుర్తుకువచ్చాయన్నారు. ఆంధ్రప్రదేశ్ విశ్రాంత డీఐజీ కె.లక్ష్మీరెడ్డి కళాశాల జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. డబ్బు సంపాదించాక దాన్ని సామాజిక అవసరాలకు వెచ్చించాలని, దానివల్ల జీవన కాలం పెరుగుతుందని చెప్పారు. హిమాచల్ ప్రదేశ్ విశ్రాంత కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఎ.ఆర్.ఎం.రెడ్డి మాట్లాడుతూ పేదల కళాశాల ఆర్ట్స్ కళాశాల అని ఎంతో మంది తనలాంటివాళ్లకు ఉజ్వల భవిష్యత్తును ఇచ్చిందన్నారు. ఇక్కడి టీచర్ల అంకితభావం, నిబద్ధత గొప్పదన్నారు. తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు ఆర్. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఈ కళాశాలలో చదివినవారు విభిన్నరంగాల్లో రాణించారని ఉదహరించారు. విశ్రాంత మున్సిపల్ కమిషనర్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ బికాం కోర్సులో ప్రతిభావంతులకు బంగారు పతకం కోసం ప్రతి ఏటా రూ.50వేలు ఇస్తానని ప్రకటించారు. శాసనమండలి మాజీ సభ్యుడు వెంకటశివారెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణతో చదువులు నేర్పిన కళాశాలకు ఎమ్మెల్సీగా కొంత రుణం తీర్చుకున్నానని తెలిపారు. హైదరాబాద్ ప్రఖ్యాత కథారచయిత ఉషారాణి మాట్లాడుతూ 'గుప్పెడంత మనసు' అనే టీవీ సీరియల్లో రిషి కేరక్టర్‌ను ఆనాటి తమ అధ్యాపకుడి గురించి కథగా తీసుకొని రాశానంటే ఆ రోజుల్లో అధ్యాపకుల ఆదర్శనీయ జీవితం ఎంతగొప్పదో అవగతం చేసుకోవచ్చన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులను కళాశాల తరపున ప్రిన్సిపల్ డాక్టర్ రవీంద్రనాథ్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలుమ్ని కార్యదర్శి కె.శివరాం, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థిని సన్మానిస్తున్న శ్రీనివాసరెడ్డి

## 'ఏచూరి'కి మున్సిపల్ కార్మికుల నివాళి

**ప్రజాశక్తి - కడప అర్బన్**



ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ కార్మికులు

సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి సిఐటియు మున్సిపల్ కార్మిక యూనియన్ నాయకత్వన కార్మికులందరూ కలిసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కంచుపాటి తిరుపాల్ మాట్లాడుతూ జాతీయ ప్రధాన కార్యదర్శిగా వరుసగా మూడు సార్లు ఎన్నిక అయిన గొప్ప నాయకుడని తెలిపారు. కార్మిక పక్షపాతి అని పుచ్చలపల్లి సుందరయ్య తరవాత అంతటి నాయకుడిని మనం కోల్పోయామని తెలిపారు. వారి ఆశలు సాధించేందుకు మన వంతు కృషి చేయాలని చెప్పారు. కంచుపాటి శ్రీరామ్ మాట్లాడుతూ చనిపోయిన తర్వాత శరీరాన్ని ఢిల్లీలో ఎయిమ్స్ హాస్పిటల్ విద్యార్థులు పరీక్షలు నిర్వహించుకోవడానికి అందజేసిన గొప్ప గుణం కలిగిన వ్యక్తిగా అభివర్ణించారు. ఆయన లేని లోటు ఎవ్వరు పూడ్చలేరని పేర్కొన్నారు. సుంకర రవి మాట్లాడుతూ మనందరికీ ఆయన ఎంతో స్ఫూర్తిదాయమని, సుందరయ్య తర్వాత అంతగా కార్మికుల శ్రేయస్సు కోసం శ్రమించిన వ్యక్తిని తానే కాకుండా తన ధర్మపత్నిని కూడా కార్మికుల కోసం సిపిఎంలో కొనసాగిస్తున్న అంకిత భావం కలిగిన వ్యక్తిగా కొనియాడారు. కార్యక్రమంలో సుంకర కిరణ్, ఇత్తడి ప్రకాష్, మస్తాన్, వడ్లపల్లి శ్రీధర్ బాబు, నాగరాజు, చిట్టి, జైసింహ,నవకాంత్, మహదేవ్, పెద్దోడన్న, ఆదాం, రాజు, సంతోషమ్మ, రవణమ్మ పాల్గొన్నారు.

## వరద బాధితులకు ఆర్థిక సాయం

**ప్రజాశక్తి -కడప సిటీ**



చెక్కును అందజేస్తున్న బిసి సంఘం నాయకులు

విజయవాడ వరద బాధితులకు జిల్లా బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకర్రావు ఆదేశాల మేరకు రూ. 30 వేలను కడప జిల్లా బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడి సమక్షంలో ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న గోవిందు నాగరాజు, బత్తుల లింగమూర్తి, ములకాని త్రివిక్రమ్ యాదవ్, సునీల్ జయంత్ , కళ్యాసుధాకర్, ఆర్ల గంగయ్య, పల్లా నరసింహారావు, మునిరత్నం గౌడ్ పాల్గొన్నారు.

## ప్రజా'దృష్టి'

## మోదం..ఖేదం!

జిల్లా విద్యా రంగం సమస్యలకు నిలయంగా మారింది. ఒక వైపు జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల వజ్రోత్సవం, మరోవైపు పులివెందుల మెడికల్ కళాశాల అడ్మిషన్ల నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా సీట్లు నిలుపుదల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాలకు 75 ఏళ్లు నిండిన సందర్భంగా నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి మాజీ సిఎస్ స్థాయి ఐఎఎస్ అధికారుల దగ్గర నుంచి వివిధ రంగాల్లో సాఫల్యాలు సాధించిన ఎందరో విద్యావంతులు హాజరు కావడం సంబరాన్ని తలపించింది. వైసిపి సర్కారు హయాంలో రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా 17 వైద్య కళాశాల నిర్మాణం చేపట్టిన సంగతి తెలిసిందే. పులివెందుల మెడికల్ కళాశాల ఒకటి. ఇటువంటి వైద్య కళాశాలలో అడ్మిషన్ల నిర్వహణలో రాష్ట్రప్రభుత్వం అలక్ష్యం తీవ్ర విమర్శలకు ఆస్కారాన్ని కలిగించింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోని మెడికల్ కళాశాలలో అడ్మిషన్లు ఆగిపోతే తీవ్ర విమర్శలు వస్తాయని తెలిసినప్పటికీ నిర్లక్ష్యం వహించడం తెంపరితనమే అవుతుందని చెప్పవచ్చు. వివక్షాపూరిత, నిర్లక్ష్యపు రాజకీయాలకు ప్రజాస్వామ్యంలో మనుగడ సాగించలేవని పాలకులు గుర్తించాలి. గతేడాది వైసిపి సర్కారు పులివెందుల, మదనపల్లి మెడికల్ కళాశాలలో అడ్మిషన్లు నిర్వహణకు అవసరమైన నిర్మాణపరమైన చర్యలు తీసుకున్న సంగతి తెలిసిందే. అనంతరం 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అనంతరం పులివెందుల మెడికల్ కళాశాలకు కేటాయించిన 50 సీట్లు అడ్మిషన్ల నిర్వహణకు అవసరమైన ఆన్‌లైన్ ఆప్షన్ ఎంపిక వ్యవహారంలో నిర్లక్ష్యం చోటుచేసుకోవడం విమర్శలకు ఆస్కారాన్ని కలిగిస్తోంది. దీనిపై సంబంధిత శాఖా మాత్యులు అడ్మిషన్లు నిలుపుదలపై సమాధానం చెప్పడానికి తటపటాయించడమే నిర్లక్ష్యానికి నిదర్శనమని అర్థమవుతోంది. సంబంధిత మంత్రి కూటమి పార్టీలలో ఒకటైన బిజెపి తరుపున ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కేంద్రంలోని బిజెపి సర్కారు దృష్టికి సమస్యను తీసుకెళ్లి నేషనల్ మెడికల్ కౌన్సిల్ ద్వారా సరిదిద్దాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని చెప్పవచ్చు. జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. జిల్లాలో కృష్ణాజలాల పరవళ్లు ప్రతిధ్వనించడం పలువురిని ఆకర్షిస్తోంది. జిల్లాలోని 13 రిజర్వాయర్లలో మెజార్టీ జలాశయాల్లో కృష్ణాజలాల ద్వారా జలకళను సంతరించుకున్నాయి. ప్రధానంగా పైడిపాలెం, వామికొండ, సర్వరాయసాగర్, మైలవరం, చిత్రావతి, బ్రహ్మాసాగర్ రిజర్వాయర్లు ఉన్నాయి. వీటిలో 26.85 టిఎంసిల నిల్వ సామర్థ్యం కలిగిన గండికోట రిజర్వాయర్ ప్రధానమైంది. 25.5 టిఎంసిలను నిల్వ చేయడం ముదావహం. గతేడాది వర్షాభావ పరిస్థితులను తట్టుకోవడానికి గండికోట జలాశయం ఎంతో ఉపకరించింది. జిల్లా తాగునీటి అవసరాలను తీర్చడానికి ఎంతగానో దోహదపడిన సంగతి తెలిసిందే. రాయలసీమ జిల్లాలలోనే అత్యధిక నీటినిల్వలను చేయగలిగిన రిజర్వాయర్ గండికోట. ఇటువంటి ప్రాధాన్యత కలిగిన రిజర్వాయర్ పూర్తిస్థాయిలో జలకళను సంతరించుకోవడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

**- ప్రజాశక్తి - కడప ప్రతినిధి**



పౌష్టికాహార మాసోత్సవాలో మాట్లాడుతున్న సూపర్ వైజర్

## పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

**ప్రజాశక్తి - చక్రాయపేట**

మండలంలోని గండి కొవ్వూరు గ్రామంలోని బోజ్జి రెడ్డి గారి పల్లె అంగనవాడి కేంద్రంలో పిల్లల పౌష్టికాహారం పై అవగాహన కల్పించారు. చక్రాయపేట సెక్టార్ సూపర్వైజర్ నాగ సుభాషిణి ఆధ్వర్యంలో శనివారం పౌష్టికాహార మాసోత్సవాలను పురస్కరించుకుని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, బాలింతలు, గర్భిణులు, పిల్లలు రక్త హీనత బారిన పడకుండా ఉండేందుకు పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు మాసోత్సవాలను ప్రతి గ్రామంలో నిర్వహించి సమతుల్య ఆహారం పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, పిల్లలు రక్త హీనత బారిన పడకుండా ఐరన్ ఎక్కువగా ఉన్న ఆకుకూరలు, కూరగాయలు, జొన్నలు, గుడ్లు, మాంసాహార పదార్థాలు, బెల్లం, ఖర్జూరం వంటి వాటిని రోజు ఆహారంలో తీసుకోవాలని కోరారు. గర్భస్రావ సమయంలో ఆకు కూరలను ఎక్కువగా తినాలన్నారు. కార్యక్రమంలో సావిత్రి, చంద్రకళ, జయమ్మ, కనకమ్మ, హరిత గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లల తల్లులు పాల్గొన్నారు.

## పిల్లల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

**ప్రజాశక్తి-ప్రొద్దుటూరు:** పిల్లల ఆరోగ్యం పట్ల పెద్దలు జాగ్రత్తలు తీసుకోవాలని పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ హిమబిందు అన్నారు. సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటి (సిర్డ్) ఆధ్వర్యంలో శనివారం జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఈనెల 17న అన్ని అంగన్వాడీ కేంద్రాలలో పాఠశాలల్లో 1 నుంచి 19 ఏళ్ల లోపు పిల్ల లకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ పిల్లలకు తప్పక వేయించుకోవాలన్నారు. నులిపురుగులు సోకిన పిల్లలో రక్తహీనత పోషకాలలోపం ఆకలి మందగించడం నీరసం కడుపు నొప్పి విరోచనం బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఆల్బెండజోల్ మాత్రలు మింగించడం వల్ల రక్తహీనత నివారించి పోషకాల గ్రాహ్యతను మెరుగు పరచడం, చదువుపట్ల ఏకాగ్రతను నేర్చుకునే సామర్థ్యం పెరుగు తుందన్నారు. నులి పురుగులు సంక్రమించకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ శుభ్రమైన నీటిని తాగాలని సూచించారు. కార్యక్రమంలో సిర్డ్ అధ్యక్షులు సుబ్బారెడ్డి, కార్యదర్శి చెన్నమ్మ, సభ్యులు రమణమ్మ, గంగాభవాని ఆశాలు పాల్గొన్నారు.

## నిత్యాన్నదానానికి విరాళం

**ప్రజాశక్తి-చక్రాయపేట**

రాయలసీమ జిల్లాలలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండిక్షేత్రం వీరాంజనేయ స్వామి వారి శాశ్వత నిత్యాన్నదాన పథకానికి శనివారం సింహాద్రిపురం మండలంలోని కంబల్ది గ్రామ వాస్తవ్యులు ముల్లుకుల్లు వెంకట నాగిరెడ్డి, చిన్నపుల్లారెడ్డి రూ.50,116 విరాళాన్ని సమర్పించారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు కేసరి స్వామి ప్రత్యేక దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలు అందజేసి,శేష వస్త్రం,స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు వేద ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ స్వామి వారి దర్శనార్థం వచ్చే భక్తులకు నిత్యాన్నదానం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చక బృందం, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

**ప్రజాశక్తి- వల్లూరు**

ఎస్‌జిఎఫ్ అండర్ - 19 బాలుర బాలికల విభాగంలో జిల్లా స్థాయి సైకిల్ పోటీల్లో ఆదర్శ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఎం.సురేష్ బాబు తెలిపారు. కళాశాలలో ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ చదువుతున్న డి. మధుకర్, ఎస్.పూజిత టైం ట్రైల్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. పి.నిత్య, ఎస్.దివ్య మార్గల్ సైక్లింగ్, ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న అశోక్ గౌడ్ మార్గల్ లో మొదటి స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సురేష్ బాబు, వ్యాయామ ఉపాధ్యాయురాలు సుశీలమ్మ విద్యార్థులను అభినందించారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాశక్తి - కడప అర్బన్**



మాట్లాడుతున్న మేకల శివార్జున

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఎస్సి, ఎస్టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున పేర్కొన్నారు. శనివారం సంఘం కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేకల శివార్జున మాట్లాడుతూ నూతన ప్రభుత్వం వస్తే ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు తీరుతాయని కోటి ఆశలతో ప్రజాప్రభుత్వాన్ని ఉద్యోగ, ఉపాధ్యాయులు గెలిపించుకున్నారన్నారు. ప్రతి ఒక్కరూ తమ తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశించారన్నారు. గత ప్రభుత్వం పిఆర్‌సి కమిషన్ వేసినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే విధంగా ఫలితం లేకుండా పోయిందన్నారు. ముఖ్యమంత్రి ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యలపై వెంటనే స్పందించి పిఆర్‌సికి సంబంధించిన ఐఆర్‌ను ప్రకటించి చాలని కోరారు. డిఎ, పెండింగ్ బకాయిలన్నీ చెల్లించాలని కోరారు. 2022వ సంవత్సరంలో పెట్టిన సంపాదిత సెలవుల బిల్లులు కూడా ఇంతవరకు చెల్లించలేదన్నారు. ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలపై ముఖ్యమంత్రి స్పందించి ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పి.శేషగిరిరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.సుదర్శన్ బాబు, మేడ్చంద్రి గంగరాజు, జిల్లా కార్యదర్శి కొల్ల గంగాధర్ పాల్గొన్నారు.

## డిఎల్‌కు స్వీయ చిత్రం బహూకరణ

**ప్రజాశక్తి - ఖాజీపేట:** మాజీ మంత్రి డిఎల్ రవీంద్రారెడ్డికి ఆయన అభిమాని డాక్టర్ సోహెల్ శనివారం స్వీయ చిత్ర పటాన్ని బహూకరించారు. డిఎల్‌ను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి చిత్రపటాన్ని అందజేశారు.

## అనారోగ్యంతో చిన్నారి మృతి

**ప్రజాశక్తి - చాపాడు**

మండల పరిధిలోని నక్కలదిన్నె గ్రామంలో శుక్రవారం రాత్రి ఊపిరితిత్తుల సమస్యతో జసిశ్రీ (16నెలల చిన్నారి) మృతి చెందింది. గ్రామానికి చెందిన బాల ఎల్లయ్య, సుమలత కుమార్తె జసిశ్రీ కొన్ని రోజులుగా జలుబు సోకడంతో శ్వాస సంబంధిత సమస్యతో బాధ పడుతుంది. వైద్యం కోసం ప్రొద్దుటూరు ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా ఉపయోగం లేకుండా పోయింది. చిన్నారి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# క్రైం కార్నర్

## ఆటో బోల్తా పడి వృద్ధురాలు మృతి

**ప్రజాశక్తి - వేంపల్లె**

వేంపల్లె సమీపంలోని తిగలచెపల్లె క్రాస్ వద్ద ఆటో బోల్తా పడి సయ్యద్ కమల్ బీ (85)అనే వృద్ధురాలు మృతి చెందారు. వేంపల్లెలోని బిజ్జాం మిట్ట ప్రాంతంలోని పశువుల ఆసుపత్రి వద్ద నివాసం ఉంటున్న ఆమె శనివారం పనికి వెళ్లేందుకు తోటి కూలీలతో ఆటోలో బయలుదేరారు. తిగలచెపల్లె క్రాస్ వద్దకు రాగానే ఆటో టైర్ పగిలి బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న సయ్యద్ కమల్ బీ కింద పడడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. ఈమెను స్థానికులు స్థానిక ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. మెరుగైన చికిత్సల కోసం కడప రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో పరిస్థితి విషమించి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

# క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

## - యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల క్రీడల పోటీల్లో డిఇఒ అనురాధ

**ప్రజాశక్తి - కడప అర్బన్**

మానసిక, శారీరక వికాసానికి క్రీడలు ఎంతగానో తోడ్పడతాయని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.అనురాధ పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలను పురస్కరించుకుని జిల్లా శాఖ నిర్వహించిన క్రీడా పోటీలను డిఇఒ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వర్ణోత్సవ వేడుకలను పురస్కరించుకుని యుటిఎఫ్ కడప జిల్లా శాఖ ఉపాధ్యాయులకు జిల్లాస్థాయి క్రీడా పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. నిరంతరం విద్యాబోధనలో తల మునకలై ఉండే ఉపాధ్యాయులకు ఈ పోటీల నిర్వహణ మంచి ఆటవిడుపు లాంటిదన్నారు. ఉపాధ్యాయులకు మానసిక వికాసంతో పాటు, శారీరక శ్రమ కూడా అవసరమన్నారు. ఉపాధ్యాయులు విద్యా బోధనతో పాటు నిరంతరం ఆటలకు కొంత సమయాన్ని కేటాయిస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని పేర్కొన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోగలిగితే విద్యా బోధనలో కూడా చక్కగా రాణించగలరన్నారు. యుటిఎఫ్ కేవలం ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలకే పరిమితం కాకుండా ఇలాంటి క్రీడా పోటీలను నిర్వహించి ఉపాధ్యాయుల్లోని ప్రతిభ పాటవాలను వెలికి తీయడం మంచి పరిణామన్నారు. ఈ క్రీడా పోటీలను ఉపాధ్యాయులు చక్కగా వినియో గించుకోవాలని ఆమె కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు మాట్లాడుతూ యుటిఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణోత్సవ సంబరాలను నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగానే ఉపాధ్యాయులకు షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్, చెస్, క్యారమ్స్, షార్ట్ పుట్, పరుగు పందాలు, వాకింగ్, టెన్నికాయిట్ క్రీడా పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 50 ఏళ్ల ఉద్యమ ప్రస్థానాన్ని నెమరు వేసుకుంటూ డిసెంబర్ 13, 14, 15, 16 తేదీల్లో నాలుగు రోజుల పాటు కాకినాడలో యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను కన్నుల పండుగగా నిర్వహించ తలపెట్టామన్నారు. స్వర్ణోత్సవ మహాసభలకు ఉపాధ్యాయులను సన్నద్ధం చేస్తూ వివిధ రూపాల్లో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. జిల్లాస్థాయిలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలకు ఉపాధ్యాయుల నుంచి మంచి స్పందన లభించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు డి.సుజాత రాణి, ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఎస్.ఎజాస్ అహ్మద్, చంద్ర ఓబుల్ రెడ్డి, ఎ.శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.రూతు ఆరోగ్యమేరి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రభాకర్ తో పాటు పలువురు జిల్లా కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న డిఇఒ అనురాధ

# సిఐటియుకు ఆపాదించడం తగదు

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్**

సిఐటియు సంఘానికి సంబంధం లేని వ్యక్తులను సిఐటియుకు ఆపాదించడం తగదని జమ్మలమడుగు సిఐటియు అధ్యక్షుడు జి.ఏసుదాసు, కార్యదర్శి దాసరి విజయ్ సంయుక్తంగా తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన వారు మాట్లాడుతూ సిఐటియు అన్ని వర్గాల కార్మికులను కలుపుకొని ప్రజా సమస్యల పైన నిరంతరం పోరాటాలు చేస్తూ ఆకర్షితులైన అన్ని రంగాల కార్మికులను సిఐటియులో చేరుతున్నారన్నారు. సంఘం అభివృద్ధిని చూసి ఓర్వలేక కొంతమంది దుర్మార్గులు సంఘం పైన బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఈ అంశం పైన కఠిన చర్యలు ఉంటాయని వారు హెచ్చరించారు. ఈనెల 12న పత్రికా ప్రకటనలో సిఐటియు నుండి కొంతమంది కార్మికులు ఎఐటియుసిలోకి వచ్చారని ఆ సంఘ స్థానిక నాయకులు ప్రసాద్, లక్ష్మీ నారాయణ ప్రకటన ఇచ్చారని, ఇందులో ఏమాత్రం వాస్తవం లేదని పేర్కొన్నారు. తమ సంఘానికి సంబంధం లేని వ్యక్తులను సిఐటియుకు ఆపాదించడం నీతిమాలిన ప్రకటనగా భావిస్తున్నామని వారు తెలిపారు. గతంలో ఇలానే సిరివెళ్ల లక్ష్మీనారాయణ అనే వ్యక్తి కొంతమంది వర్కర్లను బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడ్డాడని, వర్కర్లు ఒత్తిడి తాళలేక జమ్మలమడుగు పోలీస్ స్టేషన్‌లో ఆయనపై ఫిర్యాదు చేశామని చెప్పారు. నాయకులు అనేవారు కార్మికులకు అండగా ఉండాలే తప్ప కార్మికుల రక్త మాంసాలు పీక్కు తినేలా వీరి వ్యవహారం ఉందని వారు అన్నారు. సమావేశంలో సిఐటియు నాయకులు కరిముల్లా, మహమ్మద్, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

## వైభవంగా 'గాడిచర్ల' జయంతి వేడుకలు

**ప్రజాశక్తి - కడప అర్బన్**

గాడిచర్ల హరి సర్వోత్తమరావు జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దిన్ పూలమాలవేసి నివాళులర్పించారు. శనివారం పాత జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉన్న నిలువెత్తు విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమీరుద్దిన్ మాట్లాడుతూ 1883, సెప్టెంబర్ 14న కర్నూలులో భాగీరథీ బాయి, వెంకటరావు దంపతులకు గాడిచర్ల హరిసర్వోత్తమ రావు జన్మించారని పేర్కొన్నారు. వారి పూర్వీకులు కడప జిల్లా, సింహాద్రిపురం గ్రామానికి చెందిన వారని చెప్పారు. కర్నూలు, గుత్తి, నంద్యాలలో ప్రాథమిక, ఉన్నత విద్య ను అభ్యసించారని తెలిపారు. చదువుకునే ఆర్థికస్తోమత లేకున్నప్పటికీ, ప్రతిభా పారితోషికాల సహాయంతో 1906లో మద్రాసులో ఎం.ఏ డిగ్రీ పూర్తి చేశారని చెప్పారు. 1907లో స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రవేశించారని పేర్కొన్నారు. స్వరాజ్యం అనే తెలుగు పత్రికను ప్రారంభించి, బ్రిటిషు పాలనపై విమర్శలు ప్రచురించేవారని పేర్కొన్నారు. 1914లో బాల గంగాధర తిలక్ హోం రూల్ ఉద్యమాన్ని ఆంధ్ర రాష్ట్ర కార్యదర్శిగా విస్తృతంగా ప్రచారం చేశారని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు ,జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది, జిల్లా గ్రంథాలయ సంస్థ సీనియర్ అసిస్టెంట్ శ్రీ.రాజ్ కుమార్, జూనియం , రికార్డ్ అసిస్టెంట్ ప్రతాప్ రెడ్డి, సుబ్బమ్మ , శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



పంట నమోదు చేస్తున్న వ్యవసాయాధికారి

## రెగ్యులర్ వ్యవసాయ శాఖ అధికారి నియామకం

### ప్రజాశక్తి వార్తకు స్పందన

**ప్రజాశక్తి- సింహాద్రిపురం**

మండల వ్యవసాయ శాఖ అధికారిగా శివ మోహన్ రెడ్డిని నియమించినట్లు ముద్దనూరు వ్యవసాయ శాఖ ఏడి వెంకటసుబ్బయ్య తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలో రెగ్యులర్ ఎఒ లేకపోవడంతో కొంతమేర రైతులు ఇబ్బంది పడేవారన్నారు. ఇటీవల ప్రజాశక్తి దినపత్రికలో 'రెగ్యులర్ ఎఒ లేక రైతులు ఇక్కట్లు' అనే కథనం రావడంతో అధికారులు స్పందించారు. రెగ్యులర్ నియామకం పట్ల రైతులు వర్షం వ్యక్తం చేశారు. **పంట నమోదుకు నేడే చివరి గడువు..** ముద్దనూరు డివిజన్ పరిధిలో పంట సాగు చేసిన ప్రతి రైతూ తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ ఏడి వెంకటసుబ్బయ్య తెలిపారు. శనివారం మాట్లాడుతూ డివిజన్ పరిధిలో 90 శాతం పంట నమోదు పూర్తయిందని ఆయన తెలిపారు. మిగిలిన రైతుల సైతం ఈనెల 15 నాటికి పంట నమోదు పూర్తవుతుందని, అవకాశాన్ని రైతులు దృష్టిలో పెట్టుకొని నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు.

## రగ్బీ పోటీలకు 'వివేకానంద' విద్యార్థులు

**ప్రజాశక్తి - సింహాద్రిపురం**

రాష్ట్రస్థాయి అండర్ - 19 రగ్బీ పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు శ్రీ వివేకానంద హై స్కూల్ కరస్పాండెంట్ ఖాదర్ వలీ, డైరెక్టర్ జాఫర్ తెలిపారు. శనివారం ఎంపికైన విద్యార్థులు హరీష్, ప్రవీణ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 13న 68వ ఎస్‌జిఎఫ్ఐ రాష్ట్రస్థాయి అండర్ - 19 రగ్బీ సెలెక్షన్స్ గండిలోని గురుకుల పాఠశాలలో నిర్వహించారు. ఇందులో కడప జిల్లా రగ్బీ జట్టుకు సింహాద్రిపురం శ్రీ వివేకానంద హై స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారని చెప్పారు. వీరు రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పిఇటి త్రిలోక్ నాథ్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కమనీయంగా శ్రీరంగనాథ స్వామి కల్యాణం

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

పట్టణంలో వెలసిన శ్రీ రంగనాథ స్వామి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. వారం రోజులుగా స్వామివారికి నూలు పూజ మహోత్సవాలను ఆలయంలో నిర్వహిస్తున్నారు. పూజ కార్యక్రమాల అనంతరం స్వామివారికి భూదేవి శ్రీదేవి సమేత రంగనాథ స్వామి కల్యాణాన్ని ఆనవాయితీగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం శ్రీ రంగనాథ స్వామి ఆలయ కల్యాణ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత రంగనాథ స్వామికి వేద పండితులు వేద మంత్రోచ్ఛణల మధ్య కల్యాణాన్ని వైభవంగా చల్లా వంశీయుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ చిన్నప్ప, కో-ఆప్షన్ నెంబర్ చంద్రమౌళి, ఇఒ రమణ, ఆలయ పూజారి రాజేష్ శర్మ, చల్ల వంశీయులు ప్రజలు పాల్గొన్నారు.

## యుటిఎఫ్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**ప్రజాశక్త- కాశినాయన**

మండల యుటిఎఫ్ నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ జిల్లా కౌన్సిలర్ జోజయ్య మాట్లాడుతూ మండల అధ్యక్షులుగా బి భాస్కర్ రెడ్డి, గౌరవాధ్యక్షులుగా కె.ఆనందరావు, ఉపాధ్యక్షులుగా జి. జయమ్మ, ఎ.నాగమణి, ప్రధాన కార్యదర్శి ఎస్. గురప్ప కోశాధికారి వి.సుగుణ రావు కార్యదర్శులుగా ఎస్.కె. పీర్ బాషా, ఎ. మారుతి, కె. పిచ్చయ్య, జిల్లా కౌన్సిలర్లు గా కె. జోజయ్య ఓ బాల శోభన్ కుమార్, ఎస్ ప్రసాద్, ఆడిట్ కమిటీ వెంకటస్వామి, బి. పరిమళ జ్యోతి, ఎ.శివను ఎన్నుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా మండల కమిటీ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ నిరంతరం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాడుతూ ఉంటామని పేర్కొన్నారు. **కలసపాడు :** మండల యుటిఎఫ్ శాఖ అధ్యక్షులుగాజి. బాల ఓబయ్యను ఎన్నుకున్నారు. పోరుమామిళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన యుటిఎఫ్ మండల కౌన్సిల్ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్, జిల్లా కార్యదర్శి కె. చెన్నయ్య ,మాజీ కార్య దర్శి, కన్నా. జోజయ్య ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షులుగా డి రమణయ్య, అధ్యక్షులుగా జి. బాల ఓబయ్య, ఉపాధ్యక్షులుగా బి. ప్రభాకర్, వి. రాజకుమారి, ప్రధాన కార్యదర్శిగా ఎస్. సుమన్ కోశాధికారి, ఎన్. సురేష్, రవికుమార్, మండల కార్యదర్శులుగా ఎల్. మల్లేశ్వరి, కే .రాజమ్మ, కె. విజయ ప్రభావతి, జిల్లా కౌన్సిలర్‌గా ఎ. వెంకటసుబ్బయ్య, ఎస్.గురయ్య ఆడిట్ కమిటీగా ఏ. శ్రీనివాసులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కలసపాడు, కాశినాయన, పోరుమామిళ్ల, బి. కోడూరు, యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సిఎంకు తులసిరెడ్డి లేఖ

**ప్రజాశక్తి - వేంపల్లె**

కడప - రాజంపేట - రేణిగుంట జాతీయ రహదారి నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వంతో చర్చించి అటవీ అనుమతులను ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి అటవీ మంత్రి పవన్ కల్యాణ్‌కు కాంగ్రెస్ పార్టీ అధికారి ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి లేఖ రాశారు. ఈ మేరకు శనివారం డిప్యూటీ సిఎంకు లేఖ పంపించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ కడప - రాజంపేట - కోడూరు - రేణిగుంట జాతీయ రహదారి నిత్యం రద్దీగా ఉంటుందన్నారు. అలాగే చెన్నై - ముంబై మహానగరాలను అనుసంధానం చేసే రహదారి అన్నారు. అలాంటి రహదారికి కేంద్ర ప్రభుత్వం రూ. 2254 కోట్లతో 122 కిలోమీటర్ల పొడవుతో 4 వరుసల రహదారిని మంజూరు చేసిందని తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులకు 2023 అక్టోబర్‌లో టెండర్ పూర్తైనట్లు చెప్పారు. లక్ష్మీ ఇన్ ఫ్రా సంస్థ దక్కించుకుందని చెప్పారు. 11 నెలలైనా పనులు మొదలు పెట్టక పోవడం దారుణమని అన్నారు. 100 హెక్టార్ల అటవీ భూమికి సంబంధించి అనుమతి రాని కారణంగా పనులు మొదలు పెట్టలేదని చెప్పారు. కావున ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జోక్యం చేసుకుని సంబధిత అధికారులతో చర్చించి అటవీ అనుమతులు తెప్పించి త్వరగా జాతీయ రహదారి పనులు మొదలు పెట్టాలని విజ్ఞప్తి కోరారు.

## తులసిరెడ్డికి అభినందనలు

**ప్రజాశక్తి - వేంపల్లె :** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ముఖ్య అధికార ప్రతినిధిగా ఎన్నికైన తులసిరెడ్డికి పలువురు కాంగ్రెస్ నాయకులు అభినందనలు తెలిపారు. శనివారం వేంపల్లెలో ఉన్న తులసిరెడ్డిని కడప నగరానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత, ప్రముఖ సంఘ సేవకులు సయ్యద్ సలా ఉద్దీన్, మహిళా కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షురాలు శ్యామలమ్మ, సీనియర్ కాంగ్రెస్ నేత శాంతయ్య, పులివెందులకు చెందిన తిరుపాల్ రెడ్డి, రమేష్, శివ, చక్రాయపేట, తొండూరు మండలం కాంగ్రెస్ నేతలు ప్రసాద్, విజయ భాస్కర్ రెడ్డి, గంగరాజులు కలిసి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

## మెడికల్ సీట్లను కొనసాగించాలి

**ప్రజాశక్తి-కడప అర్బన్ :** పులివెందుల మెడికల్ కళాశాలకు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ద్వారా కేటాయించిన సీట్లను తిరిగి కొనసాగించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివశంకర్, గుజ్జుల వలరాజు డిమాండ్ చేశారు. శనివారం అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని పులివెందులకు ప్రభుత్వ మెడికల్ కళాశాల రావడం, దానికి మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఈ సంవత్సరం 50 సీట్ల కేటాయించారని తెలిపారు. టిడిపి ప్రభుత్వం అనుమతి ఇవ్వకుండా ఉండడం దుర్మార్గమని అన్నారు. వైద్య విద్య కోసం విద్యార్థులు ఇతర దేశాలకు వలస వెళ్లి డబ్బులు నష్టపోతున్నారని వాపోయారు. పులివెందుల మెడికల్ కళాశాల సీట్ల భర్తీ చేయడం ద్వారా రాష్ట్ర విద్యార్థులకు మంచి అవకాశం అన్నారు. జిల్లా మొత్తంగా 7 నియోజకవర్గాల్లోని టిడిపి ప్రభుత్వానికి ఐదు సీట్లు కేటాయించి గ్రాడ్యుయేట్ ఎలక్షన్స్‌లో పులి వెందుల మొదలుకుని పార్టీకి జిల్లా విద్యార్థులు, యువకులు, ప్రజలు, విశ్వసనీయతను తెలిపారని పేర్కొన్నారు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు లెటర్ రాయడం ద్వారా రాజకీయ కుట్ర కోణం స్పష్టంగా కనబడుతుందని తెలిపారు.





శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కె.వి.కె అధిపతి బాలకృష్ణ

## పూల సాగుపై రైతులకు అవగాహన

**ప్రజాశక్తి - మైదుకూరు**

మండల పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రవేత్తలు చామంతి, నేల సంపంగి, పూల సాగు, విలువ జోడింపు విధానాలపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. వికసిత్ భారత్ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా నాలుగు రోజులుగా మిరప, ఉల్లి, పసుపు, టమోటా పంటల సాగు యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి డాక్టర్ బాలకృష్ణ తెలిపారు. శనివారం ఐదవరోజు కార్యక్రమంలో భాగంగా పూల పంటల సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ పూల పంటలో సాగులు పాటించవలసిన భూసార పరిమితులు, ఎరువుల యాజమాన్యం, నేల రకాలు, విత్తన రకాలు మొదలైన విషయాల గురించి సమగ్రంగా తెలియజేశారు. శిక్షణ కార్యక్రమంలో పలువురు శాస్త్రవేత్తలు రైతులకు పూల సాగుపై వివరించారు. శిక్షణ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

## డ్రాయింగ్‌లో విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి - వేంపల్లె**

హిందీ భాషా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చూపారు. శనివారం హిందీ భాష దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. దీంతో బాలుర పాఠశాలకు చెందిన ధనుంజయ్ , రామ్ చరణ్, భువనేశ్వర్, హమీద్, భరత్, మనోహర్, బాలకార్తీక్, ఫజల్ ఖాన్ అనే విద్యార్థులు ప్రతిభ చూపడంతో ఆ విద్యార్థులకు హెచ్ఎం శివ మునెమ్మ బహుమతులు ప్రదానం చేశారు. అంగ్లంతో పాటు హిందీ భాషపై పట్టు సాధిస్తే దేశంలో ఎక్కడైనా ఆయా రంగాల్లో పని చేయవచ్చు అన్నారు. అలాగే హిందీ భాషపై విద్యార్థులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డ్రాయింగ్ మాస్టర్ సురేష్ కుమార్, పర్వీన్, లతా, హరినాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు సౌకర్యం కల్పించాలి : సిఐటియు

**ప్రజాశక్తి - కడప అర్బన్**

మృత్యుంజయ కుంటలో ప్రజల సౌకర్యార్థం రోడ్డు సౌకర్యం కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే కలెక్టర్ శివశంకర్‌కు వినతిపత్రం అందజేశామని తెలిపారు. సైనిక సంక్షేమ భవన్ నుంచి మృత్యుంజయ కుంట వరకు రోడ్డు లేదని పేర్కొన్నారు. 42/850 నుంచి 42/863 డోర్ నంబర్ వరకు రోడ్డు వేయాలని తెలిపారు.

## 'గౌతమి'లో ఘనంగా ఇంజినీర్స్ డే

**ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్**



నమూనాను పరిశీలిస్తున్న కరస్పాండెంట్, ప్రిన్సిపల్

గౌతమి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీర్స్ డే ఘనంగా నిర్వహించారు. శనివారం గౌతమి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య 157వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ కళాశాల ప్రిన్సిపల్ రామసుబ్బమ్మ మాట్లాడుతూ దేశంలోని ఇంజనీర్స్ అందరికీ విశ్వేశ్వరయ్య ఆదర్శప్రాయుడన్నారు. ఆర్థిక సంస్కరణలు ప్రతిపాదించిన వ్యక్తి విశ్వేశ్వరయ్యని కొనియాడారు. 'పరిశ్రమలను స్థాపించండి లేదా నశించండి' అనే నినాదాన్ని ఇచ్చి దేశం మొత్తం ప్రచారం చేయడమే కాక అమలు చేయడంలో కీలక పాత్ర పోషించారు అన్నారు. రెండవ పంచవర్ష ప్రణాళికలో పరిశ్రమలకు పెద్దపీట వేయడంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య కృషి గణనీయమైందన్నారు. నూతన ఆవిష్కరణలు చేసి తద్వారా సమాజంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ బాబమ్మ, డైరెక్టర్‌లు నాగూరు, రవీంద్రారెడ్డి, కో డైరెక్టర్ శైలుషా, డిప్లమా ప్రిన్సిపాల్ వై ప్రకాష్ రావు, వివిధ విభాగ అధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## రూ.1.08 లక్షలు పలికిన గణేష్ లడ్డూ

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

పట్టణంలోని మారుతి హాల్ రోడ్డులో వెలసిన శ్రీ ఏకలవ్య వినాయక అసోసియేషన్ వారు శనివారం నిర్వహించిన లడ్డు వేలంపాటలో రూ.1,08,000 అంబకపల్లికి చెందిన పూజారి హర్ష వర్ధన్ రెడ్డి, కమతం మహీధర్ లడ్డు కైవసం చేసుకున్నారు. మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పూజారి హర్ష వర్ధన్‌రెడ్డి, కమతం మహీధర్ లడ్డును అందజేశారు. కార్యక్రమంలో కార్యనిర్వహకులు, కమిటీ సభ్యులు పెనుగొండ తరుణ్, చిన్న పెనుగొండ అరుణ్ కుమార్, కాకి వీరాంజనేయులు, నవీన్, మహేంద్ర, మహమ్మద్, సన్నీ, అత్తు, వంశీ, కార్తీక్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## నైపుణ్యాభివృద్ధిని పెంచుకోవాలి

**ప్రజాశక్తి - వేంపల్లె :**

విద్యార్థులు నైపుణ్యావృద్ధిని పెంపొందించుకోవాలని ఐబిఎం స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ జి. నాగరాజు పేర్కొన్నారు. ఐదు రోజులుగా ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో స్కిల్ డెవల ప్‌మెంట్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 31 సంవత్సరాలు అనుభవం ఉన్న నాగరాజు క్యాంపస్ లోని 3, 4 సంవత్సరానికి చెందిన విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. 5 రోజు లపాటు శిక్షణ పొందిన విద్యార్థులకు శనివారం సర్టిఫికెట్లు అందజేశారు. సర్టిఫికెట్లు ద్వారా విద్యార్థులకు ఇంటర్నెట్ షిప్ అండ్ ప్లేస్ మెంట్ వచ్చే అవకాశాలు ఉంటాయని తెలిపారు. అన్ని విభాగాల ఇంజి నీరింగ్ ఫ్యాకల్టీకి కూడా శిక్షణ ఇచ్చారని చెప్పారు. 5 రోజులపాటు ఉచితంగా విద్యార్థులకు, ఫ్యాకల్టీకి శిక్షణ ఇచ్చినందుకు నాగరాజును డైరెక్టర్ ఎవిఎస్ కుమారస్వామి గుప్త శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ అమరేంద్ర కుమార్ సంద్రా, పరిపాలన అధికారి రవికుమార్, అకాడమిక్ డీన్ రత్నకుమారి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సుందర్, వినోద్, తిరుపతి రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.